క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం అమానుషం

మద్దిపాడు: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని కూల్చివేయడం అమానుషమని ఆ పార్టీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఇటువంటి ఆగడాలకు పాల్పడటం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం సమంజసం కాదన్నారు. ఇలాంటి ఘటనలతో టీడీపీ పతనం మొదలైందన్నారు. ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలు మానుకుని రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు టీడీపీ పాలకులు ఆలోచించాలని ఆయన హితవు పలికారు.

పశు సంరక్షణపై అవగాహన అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

చీమకుర్తి: పశువైద్య సిబ్బందికి జిల్లా పశువైద్యాధికారిణి డాక్టర్ కే బేబీరాణి పశు సంరక్షణపై అవగాహన కల్పించారు. శనివారం పేర్నమిట్టలోని పశువైద్యశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జంకు సంరక్షణ, జంకు సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ చిరంజీవి, కాలేషా, సిబ్బంది పాల్గొన్నారు.

పెదకొత్తపల్లిలో నేడు మెగా వైద్య శిబిరం

మద్దిపాడు: మండలంలోని పెదకొత్తపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆస్టర్ రమేష్ నల్లూరి సూపర్ స్పెషాలిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పీఆర్‌ఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. బీపీ, షుగర్, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులిస్తారన్నారు. మెగా వైద్యశిబిరానికి జనరల్ సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ నితిన్ నల్లూరి, జనరల్ మెడిసిన్ వైద్యనిపుణులు డాక్టర్ కార్తీక్ కామని, నరాల వైద్య నిపుణులు డాక్టర్ సురేష్‌బాబు హాజరై సేవలందిస్తారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో పెట్టించాలి

ఒంగోలు సెంట్రల్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యాహక్కు చట్టాన్ని అమలు పరచడంలో జిల్లా విద్యాశాఖ విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ విమర్శించారు. జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు అమ్ముతున్నారని, నచ్చిన పేర్లతో ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇవన్నీ విద్యాశాఖ అధికారులకు కనిపించడం లేదా..? లేక కనపడినా సరే అవినీతికి పాల్పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అనే విషయం తెలియాల్సి ఉందన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఎటువంటి పేర్లు స్కూల్స్‌కు పెట్టకూడదన్నారు. కానీ, ఒంగోలులో ఎన్నడూ లేని విధంగా అకాడమీలు పుట్టుకొచ్చి కొత్త రకం దోపిడీకి పూనుకుంటున్నాయన్నారు. దీనిని విద్యార్థి సంఘాలు, మీడియా గుర్తించి వెలుగులోకి తీసుకువస్తున్నా సరే, అధికారులు స్పందించకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా విద్యాశాఖ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద విద్యార్థికి సూర్యశ్రీ ట్రస్ట్ చేయూత


విద్యార్థికి సైకిల్, పుస్తకాలు అందిస్తున్న ట్రస్ట్ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: పేద విద్యార్థికి సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ చేయూత అందించింది. విద్యార్థి అబ్దుల్లా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, అందుకు అవసరమైన పుస్తకాలు, నోటు పుస్తకాలు, సైకిల్‌ను ఎస్‌ఆర్‌ఐలు శ్రీకాంత్, సతీష్ సహకారంతో ట్రస్ట్ ద్వారా అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ, చైర్‌పర్సన్ సయ్యద్ షహనాజ్, సెక్రటరీ సర్దార్‌బాషా, ట్రస్ట్ వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ, కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురిచేడు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల లో ఖాళీగా వున్న సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 24వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కె. ఆరోను బాబు తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు ఈనెల 26 న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పిద్దాం

● నగర మేయర్ గంగాడ సుజాత


కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని 70 సచివాలయాల పరిధిలో బడి మానేసిన పిల్లలందరినీ గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పిద్దామని, అందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని మేయర్ గంగాడ సుజాత పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నేను బడికిపోతా–స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వంద శాతం విద్యార్థులు పాఠశాలల్లో నమోదు కావాలని, బడి బయట విద్యార్థులు లేకుండా చూడాలని, బడి మానేసిన ఎవరూ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డు ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్స్ ప్రొటెక్షన్ సెక్రటరీలు డోర్ టూ డోర్ క్యాంపెయిన్ చేయాలన్నారు. పాఠశాలలో నమోదు కాని, బడి బయట ఉన్న డ్రాపవుట్స్ విద్యార్థులను గుర్తించి వివిధ పాఠశాలల్లో నమోదు చేయడం ద్వారా విద్యార్థుల డ్రాపవుట్ రేటు తగ్గించడం, తల్లిదండ్రులకు విద్య పట్ల అవగాహన కలిగించడం, ప్రభుత్వ పథకాల గురించి తెలియజేయడం వంటివి చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి టి.కిషోర్‌బాబు మాట్లాడుతూ వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు, వార్డు ఉమెన్ అండ్ వీకర్స్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రటరీలకు మార్గదర్శకాలు తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ పిల్లలు ఉండాల్సింది బడిలో అని, పనిలో కాదనే నినాదంతో నేను బడికి పోతా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై జూలై 12వ తేదీ నాటికి పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని కోరారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి


మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి

ఒంగోలు రూరల్: మండలంలోని గ్రామాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో అతిసార వ్యాధి వేగంగా ప్రబలుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాణి అన్నారు. వలేటివారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో భాగంగా శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకవైపు తీవ్ర ఎండలు, మరో వైపు వర్షం జల్లుల నేపథ్యంలో కొత్తనీరు వస్తోందన్నారు. ఫలితంగా స్వల్ప జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ఏఎన్‌ఎం, పీహెచ్‌సీ వైద్యుల సలహాలు పొంది చికిత్స తీసుకోవాలన్నారు. లేని పక్షాన తప్పనిసరిగా ప్రాణాంతకమయ్యే అవకాశం ఉంటుందన్నారు. శరీరంలోని నీరు పూర్తిగా కోల్పోవడం వలన లోబీపీ, అతినీరసం, రక్తం పంప్ చేయలేని పరిస్థితికి చేరతారన్నారు. ప్రాథమికంగా గ్లూకోజ్ తీసుకోవడం ద్వారా ఉపశమనం కలుగుతుందని డాక్టర్ తెలిపారు. కాచి చల్లార్చిన నీటినే వాడాలని, కలుషిత నీటిని, కొత్తనీటిని తాగవద్దని ఆమె తెలిపారు. వలేటివారిపాలెం మెడికల్ క్యాంప్‌లో 200 మంది అవుట్ పేషెంట్లకు చికిత్స చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గృహ సందర్శనలు చేసి దీర్ఘకాలిక వ్యాధుల వారిని పరామర్శించారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి, అమ్మవారు

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శనివారం శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శోభాయమానంగా గిరి ప్రదక్షిణ


శంకు చక్ర నామాలతో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: నగరంలోని శ్రీగిరి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని శనివారం శోభాయమానంగా నిర్వహించారు. శ్రీగిరి పాదపీఠం వద్ద గల శ్రీ బాపూజీ గో సంరక్షణశాల వద్ద జ్యేష్ఠమాసం పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ కార్యక్రమమాన్ని శ్రీగిరి స్కంద గిరి గిరి ప్రదక్షిణ సేవా కమిటీ నిర్వాహకుడు బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, ఉభయదాతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ గిరిప్రదక్షిణ కార్యక్రమం గత పది నెలల కాలంలో భక్తులకు చేరువైందని, పెద్దసంఖ్యలో మహిళలు సైతం గిరి ప్రదక్షణలో పాల్గొంటున్నారని తెలిపారు. ప్రదక్షిణకు రాలేని భక్తులు తమ ఇంటి ముంగిటకు విచ్చేసిన స్వామి వారి ఉత్సవ మూర్తికి భక్తిప్రపత్తులతో హారతులిస్తున్నారన్నారు. అంగరంగ వైభవంగా అలంకరించిన తేరుపై గజవాహనంపై కొలువైన గంగా పార్వతీ సమేత మల్లికార్జునస్వామి భక్తులను అనుగ్రహించారు. కోర్టు సెంటర్, కేశవస్వామిపేట, భగీరథ సెంటర్, శర్మా కాలేజీ క్రికెట్ గ్రౌండు మీదుగా గద్దలగుంట, రాజాపానగల్ వీధులు దాటి శ్రీగిరి చేరి శ్రీనివాసుని, స్కందగిరి చేరి వల్లీదేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వార్లను దర్శించి భక్తులు తన్మయత్వం పొందారు. గిరిప్రదక్షిణలో గత రెండు సంవత్సరాలుగా పాదరక్షలు సైతం ధరించకుండా దేశ పర్యటన చేస్తూ యువతకు స్ఫూర్తియైన వైష్ణోదాస్ శివకరణ్ జాతీయ పతాక చేపట్టి పాల్గొని భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా శివకరణ్ మాట్లాడుతూ దేశ రక్షణకు అందరూ ముందుకు రావాలని, వ్యసనాలను వదిలేసి చైతన్యం పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపూజ నిర్వహించారు. శంకుచక్ర నామాలను పట్టుకుని స్వామివారి నామాలను పఠిస్తూ భక్తులు గిరి ప్రదక్షిణ పూర్తిచేశారు.

రేపు కలెక్టర్ గ్రీవెన్స్ పునఃప్రారంభం

ఒంగోలు అర్బన్: ఎన్నికల నేపథ్యంలో రద్దు చేసిన స్పందన గ్రీవెన్స్‌ను సోమవారం నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో కలిసి మీకోసం పేరుతో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో మీకోసం నిర్వహిస్తారని ఉదయం 10 గంటల నుండి ప్రారంభం అవుతుందని ప్రజలు గమనించి సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

జిల్లా గొర్రెల పెంపకందార్ల సహకార యూనియన్ చైర్మన్ పదవికి రాజీనామా


రాజీనామా పత్రాన్ని అందిస్తున్న చైర్మన్ బొట్ల

ఒంగోలు సెంట్రల్: ప్రకాశం జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ బొట్ల రామారావు శనివారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జేడీ బేబి రాణికి సమర్పించారు. జిల్లాలో గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 450 ప్రాథమిక సహకార సంఘాలు, 33 వేల మంది సభ్యులు ఉన్నారు.

కుర్రాకు తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కారం


కుర్రా ప్రసాద్‌ను పురస్కారంతో సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి, రచయిత, సాహితీవేత్త కుర్రా ప్రసాద్‌బాబును తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కారంతో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో శనివారం సాయంత్రం సత్కరించారు. పద్మశ్రీ ఘంటసాల కళాపరిషత్ సంగీత విభావరి అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పుతెర్ల కోటేశ్వరరావు, ఉప్పుతెర్ల లక్ష్మీతులసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగభైరవ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాపు కళ్యాణ మండపాధ్యక్షుడు తోటపల్లి వెంకట రంగారావు, శ్రీ నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లికార్జునరావు, కనమాల రాఘవులు, రాహుల్ ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షుడు కరణం రాఘవరావు, జిల్లా రంగభూమి కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బేతంశెట్టి హరిబాబు, అంగలకుర్తి ప్రసాద్, లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, యు.వి.రత్నం, వులిచెర్ల పరంధామరెడ్డి, అనుమల మహేంద్ర కుమార్, బొమ్మరాజు మారుతీ భాస్కరశర్మ, మారెళ్ల సుబ్బారావు, కొల్లా మధు, డాక్టర్ మొగిలి దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల బారిన పడకండి



మాట్లాడుతున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్

దర్శి: విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని డీఎస్పీ అశోక్‌వర్ధన్ సూచించారు. స్థానిక గౌతమి కళాశాలలో మాదక ద్రవ్యాల అలవాటు చేసుకుంటే జీవితాలు ఎలా నాశనమవుతాయనే అంశంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఒక్కసారే కదా రుచి చూద్దాం అనుకుంటే వాటికి బానిసలవుతారని చెప్పారు. మీ జీవితాలు సుఖమయంగా ఉండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, కొకైన్, గంజాయి వంటివి అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సీఐ సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం


వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్ యూత్ సభ్యులు

తర్లుపాడు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో ముసుగు తొలగించి క్షీరాభిషేకం చేశారు. గజమాల వేసి నివాళులర్పించారు. జై జగన్.. జోహార్ వైఎస్సార్.. జగనన్న వెంటే నడుస్తాం.... మళ్లీ సీఎంగా గెలిపించుకుంటాం అంటూ నినాదాలు చేశారు. ఈర్ల చిన్న ఆంజనేయులు, భీమనబోయిన యోగిరాములు, బి మల్లికార్జున, కొండేబోయిన శివ, కల్లు అశోక్, గోగు వంశి, వన్నెబోయిన శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పెద్ద మల్లయ్య, ఆకుల పీరా, రెహమాన్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి 26న రాత పరీక్ష

కొనకనమిట్ల: మండలంలోని వెలుగొండలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల(బాలుర)లో 6, 7, 8, 9వ తరగతిలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగులు సీట్ల భర్తీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో 25వ తేదీలోగా గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు 26వ తేదీ ఉదయం 10 గంటలకు వెలుగొండలోని గురుకుల పాఠశాలలో రాత పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో.. ఒకరికి గాయాలు


క్షతగాత్రుడికి ప్రథమచికిత్స చేస్తున్న 108 సిబ్బంది

తాళ్ళూరు (ముండ్లమూరు): మండలంలోని గుంటి గంగమ్మ దేవస్థానం సమీపంలో ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును టాటాఏస్ ట్రాలీ ఆటో వెనుకనుంచి ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్ లక్ష్మణ్ గాయపడ్డాడు. ఆటోలో ఇరుక్కున్న డ్రైవర్‌ను స్థానికులు బయటికి తీసి 108 కి సమాచారం అందించారు. 108 సిబ్బంది చెన్నారావు, గౌస్‌బాషా సంఘటనా స్థలానికి చేరి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం చీమకుర్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

స్కూల్ బస్సులు తనిఖీ


స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ కిరణ్ ప్రభాకర్

ఒంగోలు: నగరంలోని స్కూల్ బస్సులను రవాణా శాఖ అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఏటా స్కూల్ బస్సులకు పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను విద్యా సంస్థల యాజమాన్యాలు పాటించాల్సి ఉంది. అయితే, దాదాపు సగం బస్సులు ఇంకా ఫిటెనెస్‌కు రాకపోవడంతో రవాణాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. వాస్తవానికి ఆ బస్సులన్నీ షెడ్లలో ఉంటున్నాయా.. లేక రోడ్డు మీదకు వస్తున్నాయా..? అనేది గమనించేందుకు తనిఖీలు చేపట్టారు. రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల ఆదేశాలతో నగరంలో శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, విద్యార్థుల బ్యాగులు పెట్టుకునేందుకు ర్యాకులు ఉన్నాయా.. లేదా..? అనేది పరిశీలించారు. ఓవర్ లోడింగ్ ఉండడానికి వీల్లేదంటూ హెచ్చరికలు జారీచేశారు. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డు మీదకు వచ్చిన ఒక పాఠశాల బస్సును సీజ్ చేశారు. సరైన సౌకర్యాలు లేని 4 బస్సులపై, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న 7 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ విద్యా సంస్థల బస్సులు నడిపేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్సుల్లో ఎక్కే చిన్నారులకు రోడ్డు మీద పరిస్థితులు ఎలా ఉంటాయనేది తెలియదని, అందుకు ప్రతి బస్సుకు ఒక అటెండెంట్‌ను నియమించాలని స్పష్టం చేశారు. బస్సు ఆగేటప్పుడు, బస్సు స్లో అయ్యేటపుడు లైట్లు వెలిగించడంతో పాటు విద్యార్థులు బస్సు కిటికీలలో నుంచి తలలు, చేతులు బయటపెట్టకుండా డ్రైవర్, అటెండెంట్లు గమనిస్తుండాలన్నారు. యూనిఫాం ధరించాలని, కనీసం 5 సంవత్సరాల అనుభవం లేకుండా విద్యాసంస్థల బస్సులు నడపరాదని, అదే విధంగా 60 సంవత్సరాలు దాటిన వారు బస్సులు నడపరాదని తెలిపారు. శనివారం జిల్లావ్యాప్తంగా 74 బస్సులను తనిఖీ చేశామన్నారు. వాటిలో 12 బస్సులకు రూ.1,03,600 జరిమానా విధించినట్లు చెప్పారు. ఎవరైనా ప్రమాణాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో మార్కాపురం ఆర్టీవో అమర్‌నాయక్, ఎంవీఐలు రామచంద్రరావు, కిరణ్ ప్రభాకర్, ఎ.మాధవరావు, ఎల్.సురేంద్రప్రసాద్, రవినాయక్, కె.జయప్రకాష్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో హర్షిణి విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు సెంట్రల్: డిగ్రీ మూడో సంవత్సరం ఫలితాల్లో స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు తెలిపారు. బీకాంలో కలువ శైలజ (622/700) మార్కులతో మొదటిస్థానాన్ని, పర్చూరి భార్గవి (615/700) ద్వితీయ స్థానాన్ని, కంభంపాటి స్వాతి (613/700) మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారన్నారు. బీసీఏ విభాగంలో చిట్టూరి రత్న మేఘన (842/900) మొదటి స్థానాన్ని, రాయసం నిరుపమా సంజన (840/900) ద్వితీయ స్థానాన్ని, బత్తుల ఎస్తేరు రాణి, యానం దివ్య (827/900) మూడో స్థానాన్ని సాధించారని చెప్పారు. బీఏ విభాగంలో వెలమకన్ని వెంకట సాయి సత్యలత (514/600) ప్రథమ, మారం శిరీష (497/600) ద్వితీయ, పల్లవి వెంకట అమృత (492/600) తృతీయ స్థానాన్ని సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులను హర్షిణి విద్యార్థులు సాధించడం హర్షించదగిన విషయమని అన్నారు. మంచి మార్కులు సాధించటానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు.

కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసుపు, కుంకుమ అలంకరణలో రాజరాజేశ్వరీ అమ్మవారు


పసుపు, కుంకుమ ప్యాకెట్ల అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

ఒంగోలు మెట్రో: స్థానిక గద్దలగుంటలపాలెం బుర్ర బావి దగ్గర గల శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు ఏకవింశతి వార్షిక మహా కుంభాభిషేక మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కౌండిన్య శర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారికి శనివారం ఉదయం తొమ్మిది గంటలకు అర్చకులు సర్వతో భద్ర మండల దేవత, యోగిని, క్షేత్రపాలక వాస్తు, నవగ్రహ మండపారాధన హోమం, చండీహోమం, మంగళ హారతి తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రత్యంగిర యాగం, మండప దేవత నక్షత్ర హోమం, అమ్మవారికి అష్టోత్తర శత కలశ అభిషేకం, మహా పూజ నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారిని పసుపు, కుంకుమ ప్యాకెట్లతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకవర్గం, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ పరిశీలించిన ఆర్డీఓ


ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ,ఇతర అధికారులు

ముండ్లమూరు: సీజ్ చేసిన ఇసుక డంప్‌ను ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, మైనింగ్ ఏడీ వీరేష్, ఆర్ఐ మురళీకృష్ణ, సెబ్ సీఐ బి. సుందరరామయ్య శనివారం పరిశీలించారు. పసుపుగల్లు గ్రామ ఎస్సీ కాలనీ వద్ద అక్రమంగా నిల్వచేసిన ఇసుకను గతంలో పనిచేసిన తహసీల్దార్ మహమ్మద్ నయుం అహమ్మద్ సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక పై ఎటువంటి రికార్డు లేకపోవటంతో రికార్డు రాసి తహసీల్దార్ కార్యాలయంలో ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇసుకను వేలం నిర్వహిస్తామని ఆర్డీఓ సుబ్బారెడ్డి తెలిపారు. తహసీల్దార్ జె. మధుబాబు, డిప్యూటి తహసీల్దార్ జి. పుల్లారెడ్డి, వీఆర్వో రమణ, సుశీల రాణి పాల్గొన్నారు.